క్లుప్తంగా

పత్తి రైతులు బీమా నగదు చెల్లించాలి

ఇంకొల్లు(చినగంజాం): పత్తి రైతులు పంట బీమా చేసుకునేందుకు జూలై నెలాఖరులోగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్ మేరిమ్మ తెలిపారు. మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగండ్ల గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాలకృష్ణ, నాగండ్ల, సూదివారిపాలెం రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెదిన గేదె

జె.పంగులూరు: మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన అలవల అనంతారెడ్డి అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ ఎర్త్ వైర్ తగిలి మరణించింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అలవలపాడు గ్రామంలోని ట్రాన్సాఫార్మర్ ఎర్త్ వైర్ల నుంచి విద్యుత్ ప్రసారమైంది. ఈ ట్రాన్స్ ఫార్మర్‌వైపు వెళ్ళిన గేదె దానికి తగిలి అక్కడికక్కడే చనిపోయింది. దీని విలువ సుమారు రూ. 50 వేల రుపాయలు వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



కొడవలివారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా

కొడవలివారిపాలెం (కారంచేడు): యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలను అలవాటు చేసుకోవద్దని, వాటి జోలికి పోవద్దని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా సూచించారు. మంగళవారం కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. సిగరెట్, మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు గురవ్వద్దని ఆయన హితవు పలికారు. హెచ్ఎం ఎ. ఉమామహేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం ఆరుద్ర నక్షత్రం చతుర్థి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ



కార్మికులకు స్వీట్లు పంచి పెడుతున్న కమిషనర్

అద్దంకి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం సమ్మె విరమించారు. కార్మికులను అనుకూలంగా ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర కార్మికులకు స్వీట్లు పంచిపెట్టి సమ్మె విరమింపచేశారు. సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ ఉద్యోగులు శామ్యూల్, జాన్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

కనిపించని ప్రత్యేకం

- గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేక అధికారులు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం



ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

చీరాల టౌన్: దేశాభావృద్ధిలో కీలక పాత్ర పోషించే గ్రామాల అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రెండు మినహా మిగిలిన చోట్ల సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ జటిలంగా మారింది. గ్రామాల్లోకి ఎవరైనా జిల్లా అధికారో, ప్రజాప్రతినిధులు వస్తే మాత్రం కేవలం ఆ పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. చీరాల మండలంలో 22166 నివాస గృహాలు, జనాభా 85696 మంది ఉంటారు. దేవాంగపురి, ఈపురుపాలెం, గవినివారిపాలెం గ్రామాలు జనాభా పరంగా, ఆదాయపరంగా పెద్దవి. కానీ ఈ గ్రామాల్లో సిబ్బంది అరకొరగా ఉండటంతో వీధుల వెంట చెత్తాచెదారాలు కనిపిస్తూనే ఉన్నాయి. చీరాల మున్సిపాలిటీకి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్ పంచాయతీలు చిన్న గ్రామాలు. అయితే ఇక్కడ పంచాయతీకి ఆదాయంతో పాటు సిబ్బంది ఉన్నప్పటికీ ఫలితం శూన్యం. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో కూడా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీలకు ఎంపీడీఓ, ఈవోఆర్డీ, మండల విద్యాశాఖాధికారి, వ్యవసాయాధికారి, సీడీపీవోలను గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా కలెక్టర్ నియమించారు. కానీ వారానికి ఒక్కసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో, మంచినీటి పంపుల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. దోమల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల ప్రత్యేకాధికారులు తమ శాఖలపై పని చేస్తున్నారే కానీ గ్రామాలను సక్రమంగా పట్టించుకోవడం లేదు. నిధులు డ్రా చేయాలన్నా, ఖర్చులు చేయాలన్నా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఆ ప్రత్యేకాధికారి వద్దకు ఫైళ్లు తీసుకెళ్లి సంతకాలు మాత్రం చేయించుకుని రావడానికే పరిమితం అవుతున్నారు. దీంతో మండలంలోని గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ప్రత్యేకాధికారులు వీరే..

ఒక్కో గ్రామానికి ఒక్కో మండల స్థాయి అధికారిని నియమించకుండా ఒక్కో అధికారికి మూడు, నాలుగు గ్రామాలను కేటాయించారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశాలతో నియమించారు. ఎంపీడీఓ శివన్నారాయణ, ఈవోఆర్డీ ఎ.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నక్కల నాగరాజు, ఎంఈవో పి.సుబ్రమణ్యేశ్వరరావును మాత్రమే ప్రత్యేకాధికారులుగా నియమించడంలో ఆంతర్యం ఏమిటో జిల్లా అధికారులకే తెలియాలి. వారి శాఖల్లో పనులకే కాలం సరిపోతున్నందున గ్రామాల అభివృద్ధికి వీరు ప్రత్యేకంగా పనిచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



దేవినూతల గ్రామంలో ఇలా..

> **సమస్యలు పరిష్కరించేందుకు కృషి**
>
> గ్రామాల్లో చెత్తకుప్పలు తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేరు. అయితే ఉన్నంతమంది సిబ్బందితోనే సమస్యను పరిష్కరిస్తున్నాం. వీధుల వెంట చెత్తాచెదారం వేయకుండా ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నాం. ప్రత్యేకాధికారులు కూడా గ్రామాలను సందర్శించేలా కృషి చేస్తా.
>
> – బి.శివన్నారాయణ, ఎంపీడీఓ, చీరాల



గాయాలపాలైన ఇప్పల రాజశేఖరరెడ్డి



ఇప్పత స్వరాజ్యం



తాళ్ల ధరణి

శునకాల దాడులు.. జనాలకు గాయాలు

- కూకట్లపల్లిలో కుక్కల స్వైర విహారం
- ఆందోళనలో గ్రామస్తులు
- ముగ్గురికి తీవ్రగాయాలు, అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు



కూకట్లల్లి ప్రధాన వీధిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్లలోని నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మంగళవారం సాయంత్రం ప్రధాన వీధిలో ఓ కుక్క.. సైకిల్‌పై వస్తున్న ఇప్పల రాజశేఖరరెడ్డిని వెంటబడి పొట్టపై కరిచింది. ఇంటి ఆరుబయట చిమ్ముకుంటున్న ఇప్పల స్వరాజ్యంపై దాడి చేసి భుజంపై కరిచింది. అలాగే పాఠశాలకు వెళ్లివచ్చాక ఇంట్లో టీవీ చూస్తున్న తాళ్ల ధరణిని ఇంటి లోపలికి వెళ్లి భుజంపై కరిచింది. ఇది పిచ్చి కుక్కగా భావిస్తున్నారు. గాయాలపాలైన ముగ్గురు క్షతగాత్రులను హుటాహుటిన వ్యాక్సిన్ వేసేందుకు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండు నెలలుగా గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఇప్పటికైనా వాటికి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఇవే కుక్కలు కూకట్లపల్లితోపాటు ప్రధానన రోడ్డుకు దక్షిణ భాగంలో ఉన్న గొర్రెపాడు గ్రామంలో కూడా సంచరిస్తున్నాయని తెలిపారు.

ఆపరేషన్ వికటించి చనిపోవడం బాధాకరం



ఇమ్మానియేల్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న కృష్ణబాబు

బల్లికురవ: మెదడు నరాల్లో రక్తం గడ్డకట్టటంతో శస్త్ర చికిత్స చేయించగా వికటించి చనిపోవటం బాధాకరంగా ఉందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాతానగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మేదర ఇమ్మానియేల్ (44) భౌతికకాయానికి నివాళులర్పించారు. 5 రోజుల క్రితం మెదడు నరాల్లో రక్తం గడ్డకట్టటంతో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్సకు తరలించగా అక్కడ వైద్యులు శస్త్ర చికిత్స చేశారని.. చికిత్స వికటించి చనిపోయినట్లు భార్య సునీత , కుటుంబ సభ్యులు తెలిపారు. పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని కృష్ణబాబు కోరారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు. స్థానిక నేతలు ఏ. సతీష్, మూరబోయిన కొండలు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై హరిబాబు

వేటపాలెం: పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థినిలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని చీరాల సబ్ డివిజన్ శక్తి ఎస్సై ఎ. వేణుగోపాలరావు పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలి కోన్నత పాఠశాల్లో చీరాల డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు శక్తి యాప్ గురించి వివరించారు. అత్యవసర సమయంలో మహిళలు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యాప్ ఉపయోగించే విధానం గురించి వివరించారు. విద్యార్థినులపై టీజింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కలిగించారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లు ఉపయోగించ కూడదని.. సోషల్ మీడియాపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. శక్తి టీం సభ్యులు కె. సుబ్బారావు, లోకేశ్వరరావు, బి. ధనలక్ష్మి పాల్గొన్నారు.

కౌలు కార్డులతో ప్రయోజనాలు



ముప్పవరంలో మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి



వెలమవారిపాలెంలో మాట్లాడుతున్న ఏఓ

బల్లికురవ: కౌలు రైతులు కౌలుదారు కార్డు పొందటం వల్ల బహళ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో రైతులతో పంటసాగుపై జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. కౌలు కార్డు పొందటం వల్ల ఈ పంట నమోదు విత్తనాల రాయితీ పంటల బీమా విపత్కర పరిస్థితుల్లో పరిహారం పంట ఉత్పత్తులను సులువుగా అమ్ముకోవచ్చని, భూయజమానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు.

జె.పంగులూరు: కౌలు రైతులకు పంట హక్కు పత్రాలను తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. ఆరికట్లవారిపాలెం, ముప్పవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు అందరు పంట హక్కు పత్రాలను పొందటం ద్వారా పంట నష్ట పరిహారం, విత్తనాల సబ్సిడీలు, పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి దోహద పడుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు సాగు చేయటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూ సార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంట మార్పిడి విదానాన్ని పాటించాలని, అంతర పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు పంటలను సాగు చేయాలని తెలిపారు. వీఏఏ గోపీ కృష్ణ పాల్గొన్నారు.

మహిళల్లో ఆర్థిక అభివృద్ధి అవసరం



కారంచేడులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ డాక్టర్ రాఘవయ్య

కారంచేడు: కుటుంబ వ్యవస్థ సాఫీగా సాగాలంటే సమాజంలో మహిళల ఆర్థిక పురోభివృద్ధి అవసరమని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. మంగళవారం కారంచేడు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రానికి చెందిన మహిళలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మహిళలకు అనేక రకాల శిక్షణలను అందిస్తుందన్నారు. శిక్షణనిచ్చి పూర్తి అయిన తరువాత వారికి ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందిస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన గౌతమబుద్ధ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా పేదలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ ఎంపీపీ డాక్టర్ రాఘవయ్య అన్నారు. ఈఓపీ ఆర్డీ రాంమ్మోహన్, గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి, గౌతమ బుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చుండూరి రామయ్య, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన



ఎస్ఎల్ గుడిపాడులో భగద్గీతపై అవగాహన కల్పిస్తున్న హిందూ జ్ఞానవేదిక

బల్లికురవ: కాలగుణంగా గ్రామోత్సవాలు అంతరిస్తుండటంతో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని త్రేత సిద్ధాంత ప్రబోధసేవాసమితి హిందూ గ్రామ వేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు కడియం పెద్దరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం గ్రామాల్లో త్రేత సిద్ధాంతం, భగవద్గీత, ఆచార వ్యవహారాలపై పుస్తకాల పంపిణీతో అవగాహన కల్పించారు. రమేష్, రామయ్య, ఏడుకొండలు, పోతురాజు, రామాంజనేయులు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రావతి అమ్మవారికి ఆషాఢం సారె

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన్నారుషిస్వామి దేవస్థానంలో శ్రీ భద్రావతి అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా ఆషాఢ సారె మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అలానే లక్కీడిప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అమ్మవారి పసుపు, కుంకుమ అందించారు. దేవస్థాన అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, చీఫ్ సెక్రటరీ జి.వెంకటసుబ్బారావు, కోశాధికారి ఆకురాతి దేవేంద్రం, ట్రస్టీలు డాక్టర్ జి.వి.పున్నారావు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగింపు

గంగమ్మ తల్లికి పొంగళ్లు



గంగమ్మతల్లికి సారెను అందించి పూజలు చేస్తున్న మహిళలు

కారంచేడు: గ్రామదేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆషాఢమాసం మంగళవారం అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి సారెను అందించడం కోసం గ్రామ ఆడపడుచులు తరలివచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ఇంటి వద్ద నుండి తీసుకువచ్చిన సారెను, పొంగళ్ళను అందించారు.